సాక్షి అనంతపురం

సోమవారం । 30 । జనవరి । 2023



**ఆత్మీయ సమ్మేళనం**
యాడికి జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. 8లో



**టమాట కిలో రూ.22**
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.8°/11.2°
జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం స్వల్పంగా పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి.

## న్యూస్‌రీల్

### చేతివృత్తిదారులకు 'జగనన్న చేదోడు'

- నేడు లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 25,663 మందికి రూ.25.66 కోట్ల లబ్ధి



షేవింగ్ చేస్తున్న నాయీబ్రాహ్మణుడు

**అనంతపురం రూరల్:** రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలరింగ్ చేసుకునే చేతివృత్తుల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. 'జగనన్న చేదోడు' పథకం ద్వారా ఏటా రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నారు. మూడో విడత 'జగనన్న చేదోడు' నగదును సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 25,663 మందికి రూ.25.66 కోట్ల లబ్ధి చేకూరనుంది. ఇందులో అనంతపురం జిల్లాలో షాపులున్న 9,580 మంది రజకులకు, 3,020 మంది నాయీ బ్రాహ్మణులకు, 2282 మంది టైలర్లకు రూ.14.88 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 5,624 మంది రజకులకు, 1,839 మంది నాయీ బ్రాహ్మణులకు, 3,318 మంది టైలర్లకు రూ.10.78 కోట్ల నగదు జమ చేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ 'చేదోడు' పథకాన్ని అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు వివరించారు. జిల్లాకు సంబంధించిన నగదు జమ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు ఈడీ తెలిపారు.

### మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

**అనంతపురం శ్రీకంఠం సర్కిల్:** జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఫక్కీరప్ప సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గంజాయి, హాషిష్, కొకైన్, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా సాకారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. జిల్లాలో డ్రగ్స్ తయారీ లేకున్నప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి అక్రమ రవాణా చేసి అడపాదడపా విక్రయాలు, వినియోగం చేస్తున్నారన్నారు. జిల్లాలోకి అక్రమంగా రవాణా కాకుండా ప్రత్యేక నిఘా వేయాలని అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాల అనర్థాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. డ్రగ్స్ వాడకం, ఆ అలవాట్లు కలిగిన వారితో స్నేహాలు మంచివి కావన్నారు. ఇలాంటి కేసుల్లో పట్టుబడితే శిక్షలు కూడా అంతే కఠినంగా ఉంటాయన్నారు. పరిసర ప్రాంతాలు, విద్యా సంస్థల పరిధిలో డ్రగ్స్ వినియోగించే వారి గురించి స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలన్నారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చుదామని పిలుపునిచ్చారు.

### పుణ్యస్నానాలకొచ్చి.. పరలోకాలకు

- పెన్నానదిలో నీట మునిగి ఇద్దరు భక్తుల మృతి



తాడిపత్రి ఆసుపత్రిలో మృతి చెందిన వెంకటనారాయణ



మృతుడు శ్రీనాథ్

**పెద్దపప్పూరు:** పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వెళ్లిన ఇద్దరు భక్తులు లోతట్టు ప్రాంతంలో నీట మునిగి ప్రాణాలు విడిచారు. మృతుల్లో ఒకరు కర్నూలు జిల్లా, మరొకరు కర్ణాటక ప్రాంత వాసి. ఈ ఘటనలతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పెద్దపప్పూరులో అశ్వత్థ నారాయణస్వామి తిరునాళ్లు జరుగుతున్నాయి. కర్నూలు జిల్లా రాచర్లకు చెందిన వెంకటనారాయణ (30), కర్ణాటక రాష్ట్రం కొల్హాపూర్ జిల్లాకు చెందిన శ్రీనాథ్ (20) ఆదివారం తిరునాళ్లకు వచ్చారు. స్థానిక పెన్నానదిలో పుణ్యస్నానాల కోసం వెళ్లారు. ఈత రాని శ్రీనాథ్ లోతట్టు ప్రాంతంలో నీట మునిగి ఊపిరాడక చనిపోయాడు. వెంకటనారాయణ నీటిలో చిక్కుకుని అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అతడిని వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో తాడిపత్రి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంకటనారాయణ మృతిచెందాడు.

# చేరువగా ఆధార్ సేవలు

ఆధార్ నమోదు, వివరాల్లో మార్పులు, చేర్పులు, మొబైల్ నంబర్ అనుసంధానం తదితర సేవల కోసం ఇదివరకు ఎంపిక చేసిన మీ సేవ, బ్యాంకు, పోస్టల్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. టోకన్ తీసుకుని నిర్దేశించిన తేదీ వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రజల ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ సేవలను మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపట్టింది. సచివాలయాల్లోనే ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

- జిల్లాలో 79 సచివాలయాల్లో నమోదు కేంద్రాలు
- ఆధార్ ప్రత్యేక మొబైల్ క్యాంపుల నిర్వహణ
- ప్రజలకు పడిగాపుల కష్టాలు తొలగించిన సర్కార్




ఆధార్ కేంద్రం ఉన్న బుక్కరాయసముద్రం సచివాలయం- 3

**అనంతపురం అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లోనే ఆధార్ నమోదుకు చర్యలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా 79 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఒక సచివాలయంలోని ఆధార్ కేంద్రం సిబ్బంది ఆ సచివాలయ పరిధిలోనే కాకుండా మండల పరిధిలోని ఇతర సచివాలయాలకూ వెళ్లి ఆధార్ సేవలను అందిస్తున్నారు. ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తూ ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఇలా నెలలో 10 రోజుల పాటు ఇతర సచివాలయాలకు వెళ్లి దాని పరిధిలోని ప్రజలకు ఆధార్ సేవలు అందిస్తున్నారు. అంతే కాకుండా ప్రత్యేక క్యాంపులతో పాఠశాలకు వెళ్లి విద్యార్థులు ఆధార్ అప్‌డేషన్, బయోమెట్రిక్ అప్‌డేషన్ చేస్తున్నారు.

**కొత్త ఆధార్ ఉచితంగా నమోదు..**
సచివాలయాలోఆధార్ కేంద్రాల్లో కొత్త ఎన్‌రోల్‌మెంట్‌ను రుసుము తీసుకోకుండా ఉచితంగా చేస్తారు. ఆధార్ అప్‌డేట్‌కు రూ.50, బయోమెట్రిక్ అప్‌డేషన్‌కు రూ.100 రుసుము ఉంటుంది. ఈ మొత్తం చలనా రూపంలో ప్రభుత్వానికి సచివాలయ సిబ్బంది చెల్లిస్తారు. గడిచిన ఏడాదిలో సచివాలయాల ద్వారా అందించిన 82,900 సేవల ద్వారా ప్రభుత్వ ఖజానాకు చలనాల రూపంలో రూ.27,83,340 జమచేశారు.

### ఆధార్ కేంద్రాలు ఎక్కడెక్కడంటే..

జిల్లాలో ఆధార్ సేవలందించే సచివాలయాలు 79 ఉన్నాయి. అందులో అనంతపురం అర్బన్‌లో ఐదు, రూరల్‌లో ఐదు, ఆత్మకూరులో ఒకటి, బుక్కరాయసముద్రంలో రెండు, గార్లదిన్నెలో రెండు, కూడేరులో రెండు, నార్పలలో రెండు, పుట్లూరులో నాలుగు, రాప్తాడులో రెండు, శింగనమలలో ఒకటి, తాడిపత్రి రూరల్‌లో మూడు, తాడిపత్రి అర్బన్‌లో రెండు, యల్లనూరు మండలంలో మూడు, గుత్తి అర్బన్‌లో మూడు, గుంతకల్లు అర్బన్‌లో ఐదు, పామిడి రూరల్‌లో రెండు, పామిడి అర్బన్‌లో ఒకటి, పెద్దవడుగూరులో రెండు ఉన్నాయి. ఇంకా ఉరవకొండలో మూడు, విడపనకల్లులో ఒకటి, యాడికిలో మూడు, బొమ్మనహాళ్‌లో నాలుగు, బ్రహ్మసముద్రంలో రెండు, డీ.హీరేహాళ్‌లో ఒకటి, గుమ్మఘట్టలో ఒకటి, కళ్యాణదుర్గం అర్బన్‌లో మూడు, కళ్యాణదుర్గం రూరల్‌లో ఒకటి, కంబదూరులో నాలుగు, కణేకల్లులో రెండు, కుందుర్పిలో ఒకటి, రాయదుర్గం అర్బన్‌లో మూడు, శెట్టూరులో రెండు సచివాలయాల్లో ఆధార్ సేవలు లభిస్తున్నాయి.



ఆధార్ అప్‌డేషన్‌కు ఐరిస్ తీసుకుంటున్న సిబ్బంది

**ఏడాదిలో అందించిన సేవలు ఇలా..**

| | |
|---|---|
| సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు | 79 |
| కొత్తగా ఆధార్ | 7,969 |
| తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ | 31,403 |
| బయోమెట్రిక్ అప్‌డేట్ | 12,174 |
| డెమోగ్రాఫిక్ అప్‌డేట్ | 25,559 |
| ఈ-ఆధార్ | 88 |
| డాక్యుమెంట్ అప్‌డేట్ | 5,707 |
| మొత్తం సేవలు | 82,900 |
| చలనా రూపంలో ప్రభుత్వ ఖజానాకు జమ | రూ.27,83,340 |

### ఇతర సచివాలయాల్లోనూ సేవలు



అనంతరసాగర్ కాలనీలోని సచివాలయం-3లో ఆధార్ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నెలలో 10 రోజుల పాటు మండల పరిధిలోని ఇతర సచివాలయాల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ నిర్వహిస్తాం. – రవి, డిజిటల్ అసిస్టెంట్, సచివాలయం -3, బీకేఎస్

### మా పిల్లలకు ఆధార్ చేయించా



ఆధార్ చేయించేందుకు బ్యాంకులు, మీ-సేవ చుట్టూ తిరిగాను. పనికాలేదు సరికదా చాలా ఇబ్బంది పడ్డాను. ఇప్పుడు సచివాలయంలోని ఆధార్‌సెంటర్ ఏర్పాటు చేశారని తెలుసుకుని ఇక్కడికి వచ్చి మా పిల్లలకు ఆధార్ చేయించాను. ఎలాంటి ఇబ్బందీ లేకుండా త్వరగా పనయ్యింది. సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం చాలా మంచి పని.
– మసూదమ్మ, విజయనగర్‌కాలనీ, అనంతపురం

### చెంతకే ఆధార్ సేవలు



ఆధార్ సేవల కోసం ప్రజలు బ్యాంకులు, మీ-సేవ కేంద్రాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉండింది. ప్రభుత్వం సచివాలయ స్థాయిలో కొత్తగా ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేట్ సౌలభ్యం కల్పించడం ద్వారా ఆధార్ సేవలు ప్రజలకు చేరువయ్యాయి. మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తూ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు బయోమెట్రిక్, అప్‌డేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. – ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్

### నేటి నుంచి ఇంటర్ ప్రీ ఫైనల్ పరీక్షలు

**అనంతపురం:** ఇంటర్మీడియట్ ప్రీ ఫైనల్ పరీక్షలు సోమవారం నుంచి ఫిబ్రవరి ఏడో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఓ సురేష్‌బాబు తెలిపారు. ఫస్టియర్‌కు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. సోమవారం ఉదయం ఫస్టియర్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్-1, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం సెకండ్ లాంగ్వేజ్-2 పరీక్షలు ఉంటాయన్నారు. 31న ఉదయం ఇంగ్లిష్-1, మధ్యాహ్నం ఇంగ్లిష్-2, ఫిబ్రవరి 1న ఉదయం మేథమేటిక్స్-1ఏ, బోటనీ-1, సివిక్స్-1, ఒకేషనల్ సబ్జెక్టు -1, మధ్యాహ్నం మేథమేటిక్స్-2ఏ, బోటనీ-2, సివిక్స్-2, ఒకేషనల్ సబ్జెక్టు -1, రెండో తేదీన ఉదయం మేథమేటిక్స్-1బీ, జువాలజీ-1, హిస్టరీ-1, ఒకేషనల్ సబ్జెక్టు-2, మధ్యాహ్నం మేథమేటిక్స్ -2 బీ, జువాలజీ-2, హిస్టరీ-2, ఒకేషనల్ సబ్జెక్టు -2 , మూడో తేదీన ఉదయం ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1, ఒకేషనల్ సబ్జెక్టు-3, మధ్యాహ్నం ఫిజిక్స్ -2, ఎకనామిక్స్-2, ఒకేషనల్ సబ్జెక్టు -3, నాలుగో తేదీన ఉదయం కెమిస్ట్రీ -1, కామర్స్-1, మధ్యాహ్నం కెమిస్ట్రీ-2, కామర్స్-2, ఏడో తేదీన ఉదయం మోడర్న్ లాంగ్వేజ్-1, మధ్యాహ్నం మోడర్న్ లాంగ్వేజ్-2 పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

### అలరించిన చైనీయులు



నాటిక ప్రదర్శిస్తున్న చైనీయులు

**ప్రశాంతి నిలయం:** చైనీయుల నూతన సంవత్సర వేడుకలు రెండో రోజు ఆదివారం కూడా ప్రశాంతి నిలయంలో ఘనంగా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో చైనీయులు అలరించారు. తైవాన్, సింగపూర్, మలేషియా, హాంగ్‌కాంగ్, ఇండోనేషియా, జపాన్ తదితర దేశాలకు చెందిన సత్యసాయి భక్తులు నిర్వహించిన లయన్ డ్యాన్స్ చైనీస్ సంస్కృతీ సంప్రదాయాలను కళ్లకు కట్టింది. అహం వీడితే మానవుడు మాధవుడిగా మారొచ్చన్న సందేశాన్నిస్తూ నిర్వహించిన నాటిక ఆద్యంతం ఆకట్టుకుంది. సనాతన ధర్మాలైన సత్యం, ధర్మం, శాంతి ప్రేమ, అహింసలను కలిగి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను విడనాడాలన్న సందేశాన్ని చక్కగా వివరించారు. అనంతరం నిర్వహించిన సంగీత కచేరి అలరించింది.

# లోకేష్ యాత్రతో టీడీపీ పతనం ఖాయం

- తండ్రీ కొడుకులిద్దరూ రాష్ట్రానికి అపశకునాలు
- అచ్చెన్నాయుడు నోరు అదుపులో పెట్టుకోవాలి
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్



**కళ్యాణదుర్గం:** 'యువగళం' పేరుతో నారా లోకేష్ చేపట్టిన యాత్రతో టీడీపీ పతనం ఖాయమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు. ఆదివారం మంత్రి కళ్యాణదుర్గంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ఇద్దరూ రాష్ట్రానికి అపశకునాలుగా మారారని ఎద్దేవా చేశారు. బహిరంగ సభల పేరుతో కందుకూరు, గుంటూరు ఘటనల్లో అమాయకులను చంద్రబాబు పొట్టన పెట్టుకున్నారన్నారు. ఇప్పుడు లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న పరిస్థితి విషమంగా ఉండటం ఎంతో బాధాకరమన్నారు. చంద్రబాబు రాజకీయం కోసమే నందమూరి కుటుంబాన్ని వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. లోకేష్ బహిరంగ సభలకు జనం కరువయ్యారన్నారు. నమ్మకం కోల్పోయిన టీడీపీని ప్రజలు చీదరించుకుంటున్నారని గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి కోసం మంత్రులు, ఎమ్మెల్యేలపై లోకేష్ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తప్పు పట్టారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. అచ్చెన్నాయుడు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. తండ్రీ కొడుకులు ఎన్ని కుయుక్తులు పన్నినా 2024లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని పునరుద్ఘాటించారు.

# మూడేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు

- ఇంటి నుంచి వెళ్లిపోయి.. హౌరాకు చేరి..
- అనాథాశ్రమంలో ఉన్నట్లు గుర్తించి తీసుకొచ్చిన పోలీసులు
- తిరిగొచ్చిన కుమారుడిని చూసి ఉబ్బి తబ్బిబ్బైన తల్లిదండ్రులు



దేవరాజుచారిని తండ్రి శరభాచారికి అప్పగిస్తున్న పోలీసులు

**డీ హీరేహాళ్(రాయదుర్గం):** మనస్పర్థలు ఆ వ్యక్తిని మనోవ్యథకు గురి చేశాయి. ఇల్లు విడిచి రైలు ఎక్కి వెళ్లిపోయిన ఆ వ్యక్తి అనాథలా ఓ ఆశ్రమంలో చేరాడు. మూడేళ్ల తర్వాత సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వద్ద మొర పెట్టుకోగా.. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగి ఆ వ్యక్తిని గుర్తించి తీసుకొచ్చారు. తల్లిదండ్రుల కళ్లలో ఆనందం నింపారు. వివరాలిలా ఉన్నాయి. డీ హీరేహాళ్ మండలం నాగలాపురానికి చెందిన శరభాచారి, శారదమ్మ దంపతులకు దేవరాజుచారి (38) అనే కుమారుడు ఉన్నాడు. ఐదేళ్ల క్రితం కుమారుడికి వివాహం చేశారు. ఇంటి వద్దే పిండి మిషన్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకున్నాడు. పెళ్లైన ఏడాదికే దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో దేవరాజుచారి మనోవ్యథకు లోనయ్యాడు. అప్పటి నుంచి ముభావంగా ఉండేవాడు. అలా ఏడాది గడిచాక ఓ రోజున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బళ్లారికి చేరుకుని, అక్కడి నుంచి రైలు ఎక్కి వెళ్లిపోయాడు. ఎక్కడెక్కడో తిరిగి కోల్‌కతాలోని హౌరా ప్రాంతానికి చేరాడు. ఎవరో అతడిని గమనించి అనాథగా గుర్తించి అక్కడి మదర్ థెరిస్సా ఆశ్రమంలో చేర్పించారు. నిర్వాహకులు ఆరా తీసినా పూర్తి వివరాలు వెల్లడించలేదు. ఎట్టకేలకు ఇటీవల తన కుటుంబ వివరాలు తెలిపాడు. అప్పటికే మూడేళ్లుగా దేవరాజుచారి ఆచూకీ కోసం అన్వేషిస్తున్న తల్లిదండ్రులకు ఆశ్రమం నుంచి సమాచారం తెలిసింది. వృద్ధాప్యం మీద పడిన శరభాచారి దంపతులు అంతదూరం వెళ్లలేక.. తమ గోడును ఇటీవల ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వద్ద వెళ్లబోసుకున్నారు. సమస్యను అర్థం చేసుకున్న విప్ స్పందించారు. వారిచేత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. విచారణ చేపట్టిన ఎస్ఐ రామకృష్ణారెడ్డి.. అనాథాశ్రమంలో దేవరాజుచారి ఉన్నట్లు నిర్ధారణ చేసుకున్నాక కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ ఆదేశాల మేరకు సిబ్బంది నగేష్, హనుమానాయక్‌ను హౌరాకు పంపారు. వారు దేవరాజును ఆదివారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్తుడు గన్నీగౌడ సమక్షంలో దేవరాజుచారిని తండ్రి శరభాచారికి అప్పగించారు. ఇన్నాళ్లకు తిరిగొచ్చావా నాయనా అంటూ తల్లిదండ్రులు అక్కున చేర్చుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తమ కుమారుడిని తీసుకురావడంలో సహకరించిన పోలీసులు, విప్ కాపు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# బడుగు వికాసం

- ఎస్సీ, ఎస్టీలను పారిశ్రామిక వేత్తలుగా మార్చే పథకం
- మూడేళ్లలో 400 మంది దరఖాస్తు
- 325 మంది లబ్ధిదారులకు రూ.27.5 కోట్ల రాయితీలు
- పథకానికి మరో రూ.5కోట్ల నిధుల కేటాయింపు

**అనంతపురం టౌన్:** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న-వైఎస్సార్ బడుగు వికాసం' పథకం ఆశించిన ఫలితాలను అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో నైపుణ్యాలను మెరుగుపర్చి వారిని పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు వీలుగా జగన్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారి ఏపీలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.కోటి మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందజేస్తోంది. అర్హతే ప్రామాణికంగా ఏటా వందల సంఖ్యలో ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూరుస్తోంది.

**మూడేళ్లలో 325 మందికి లబ్ధి**
జగనన్న-వైఎస్సార్ బడుగు వికాసం (2020-23) పథకానికి జిల్లాలో భారీ స్పందన లభించింది. యూనిట్ వ్యయంలో 45శాతం మేర సబ్సిడీని ప్రభుత్వం అందజేస్తుండడంతో ఈ మూడేళ్ల వ్యవధిలో 400కు పైగా దరఖాస్తు అందాయి. రుణం మంజూరుకు తమకు అభ్యంతరం లేదంటూ బ్యాంకర్లు ఇచ్చిన ధ్రువీకరణ పత్రం జత చేసిన ప్రతి ఒక్కరికీ బడుగు వికాసం పథకం కింద జిల్లా పరిశ్రమ శాఖ అధికారులు లబ్ధి చేకూర్చారు. ఈ లెక్కన ఇప్పటి వరకూ 325 మందికి పథకం లబ్ధి చేకూరగా సబ్సిడీ రూపంలో రూ.27.5 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఇప్పటి వరకూ సబ్సిడీ జమ కాని లబ్ధిదారులకు ఈ ఏడాది మార్చి 31లోపు నిధులను ప్రభుత్వం జమ చేయనుంది.

**రూ.5కోట్ల నిధుల కేటాయింపు**
బడుగు వికాసం పథకానికి మార్చిలోపు దరఖాస్తు చేసుకున్న వారికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా రూ.5 కోట్ల నిధులను కేటాయించింది. ఈ మూడేళ్ల కాలంలో 90 శాతానికి పైగా దరఖాస్తుదారులు సర్వీస్, ట్రాన్స్‌పోర్టు రంగాలను ఎంచుకుని లబ్ధిపొందారు. మరో పది శాతం మంది చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపారు.

ఇతని పేరు కె.నాగరాజు రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామం. ఆరు నెలల క్రితం జగనన్న-వైఎస్సార్ బడుగు వికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, పది రోజుల్లోపు అధికారులు పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి రూ.10.62 లక్షల విలువ చేసే సరుకు రవాణా వాహనాన్ని అందజేశారు. 45 శాతం ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించడంతో నాగరాజుకు దాదాపు రూ.4,77,900 మేర లబ్ధి చేకూరింది. ఈ క్రమంలోనే ఇటీవల నాగరాజుకు సబ్సిడీ మంజూరుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అధికారులు అందజేశారు. మరో నెల రోజుల్లోపు సబ్సిడీ మొత్తాన్ని ఆయన అందుకోనున్నారు.




సరుకు రవాణా వాహనంతో లబ్ధిదారుడు నాగరాజు

### అర్హతే ప్రామాణికం



అర్హతే ప్రామాణికంగా జగనన్న - వైఎస్సార్ బడుగు వికాసం పథకం కింద లబ్ధి చేకూరుస్తున్నాం. ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటోంది. రుణం మంజూరుకు బ్యాంకర్ల నుంచి నిరభ్యంతర పత్రాన్ని తీసుకువచ్చిన ప్రతి దరఖాస్తుదారుకూ లబ్ధి చేకూర్చాం. అంతేకాక ప్రతి ఆరు నెలలకోసారి క్షేత్రస్థాయిలో యూనిట్లను పరిశీలించి సబ్సిడీ మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేస్తున్నారు. ఇప్పటికే 60 శాతం మంది ఖాతాల్లో విడతల వారీగా సబ్సిడీ మొత్తం జమ అయింది.
– నాగరాజరావు, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ




**మురిసిన చిన్నారి లోకం**
అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మూడు రోజులపాటు సాగిన బాలోత్సవం ఆదివారం ముగిసింది. బాలబాలికలు తమలోని ప్రతిభాపాటవాలను ప్రదర్శించి మురిసిపోయారు. నృత్యాలు, సందేశాత్మక నాటికలతో మెప్పించారు. 8లో

### వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేడు గాంధీ వర్ధంతి

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఉదయం పది గంటలకు జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## క్లుప్తంగా

### పట్టు బిగిస్తున్న 'బిహార్'

- హోరాహోరీగా ఆంధ్ర, బిహార్ మ్యాచ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ ఆధ్వర్యంలో అనంత క్రీడా గ్రామం వేదికగా సాగుతున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఆదివారం ఆంధ్ర, బిహార్ జట్లు తలపడ్డాయి. ఆంధ్ర జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బిహార్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 89.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. జట్టులో శ్రమణ్ నిరోధ్ 204 బంతుల్లో 21 ఫోర్లు, 1 సిక్సర్‌తో 143 పరుగులు, పరన్‌జిత్ సింగ్ 55, వివేక్‌కుమార్ 41 పరుగులు సాధించారు. ఆంధ్ర బౌలర్లలో గిరినాథ్ రెడ్డి 4, సందీప్ 2, కేఎస్ఎన్ రాజు, ఆంజనేయులు చెరో వికెట్ కూలదోశారు. పోటీలను రెఫరీ శక్తి సింగ్, అంపైర్లు రాజేష్ కన్నన్, భారతి విజ్, వీడియో అనలసిస్ట్ రహిమాన్ ఫరూఖ్, శ్రీనివాస్, స్కోరర్లు విజయ్, చైతన్య, ఏసీఎల్ఓ వెంకటేష్ పర్యవేక్షించారు.

### లారీ ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు తిమ్మారెడ్డి

పెనుకొండ: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండకు చెందిన తిమ్మారెడ్డి (56) స్థానిక మడకశిర రోడ్డులో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన స్నేహితుడితో కలసి ద్విచక్ర వాహనంపై పట్టణంలోకి వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తిమ్మారెడ్డిని స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స చేస్తుండగానే ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న పట్టణ వాసులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి వద్దకు చేరుకున్నారు. తిమ్మారెడ్డి మృతి తీరని లోటుగా పేర్కొన్నారు.

# మధురానుభూతుల బాలోత్సవం

- మురిసిన చిన్నారి లోకం
- ముగిసిన బాలల పండుగ


శ్రీకృష్ణ లీలలను తెలిపే నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం


కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: చిన్నారుల సృజనకు అద్దం పడుతూ మూడు రోజుల పాటు సందడిగా సాగిన బాలోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. చదువు ఒత్తిడిలో కళలను, సృజనను మరచిపోతున్న చిన్నారులకు బాలోత్సవం వేదిక మధురానుభూతులను పంచింది. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో సందడిగా సాగిన పిల్లల పండుగను ఆదివారం సాయంత్రం అదే స్థాయిలో విద్య, సాహితీవేత్తలను మమేకం చేస్తూ నిర్వాహకులు ఘనమైన ముగింపు పలికారు. విజేతలుగా నిలిచిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

**సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తిన చిన్నారులు**

ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిన్నారులు అద్భుత మేధస్సుతో వివిధ విభాగాల్లో ప్రతిభ చాటుకుని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తారు. చిన్నారులో పోటీ పడి మట్టితో చేసిన బొమ్మలు ప్రాంగణానికి కొత్త అందాన్ని తీసుకువచ్చింది. పరభాషా పదాలు లేకుండా అచ్చు తెలుగులో మాట్లాడడం, నీతి పద్యాలకు భావం తెలపడం, సృజనతో నీతి కథలు చెప్పడం, మూకాభినయం, శాస్త్రీయ, సినీ నేపథ్య, జానపద నృత్యాలు కేరింతలు కొట్టించాయి. నాటికల విభాగంలో ఆద్యంతం ఆకట్టుకునే విధంగా చిన్నారులు అభినయించారు. పంట సాగులో రైతులు పడే కష్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి మెప్పించారు. సినీ, శాస్త్రీయ నృత్య విభాగంలో బాలబాలికలు హోరెత్తించారు. జానపదాలతో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా చేశారు. వయసుతో నిమిత్తం లేకుండా తల్లిదండ్రులు, టీచర్లు ఉత్సాహంగా ఆడిపాడి చిన్నారులను ప్రోత్సహించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా పూజారి ఈరన్న, రియాజుద్దీన్, డాక్టర్ నగరూరు రసూల్, ఎల్కేపీ వెంకటసుబ్బయ్య, ఎల్ఆర్ వెంకటరమణ, నాగేంద్ర, వన్నూర్ మాస్టర్ వ్యవహరించారు.


ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాలోత్సవం చైర్‌పర్సన్ షమీమ్ షఫీవుల్లా

**అందమైన బాల్యాన్ని అందించాలి**

బాల్యంలోని మధురానుభూతిని చిన్నారులకు మిగల్చాలంటే ఇలాంటి బాలోత్సవాలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు పలువురు వక్తలు సూచించారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు సమావేశానికి బాలోత్సవం చైర్‌పర్సన్ షమీమ్ షఫీవుల్లా అధ్యక్షత వహించారు. అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ప్రముఖ కంటి వైద్యనిపుణుడు డాక్టర్ అక్బర్ సాహెబ్, విజయ్‌సాయికుమార్, శ్రీనివాసరావు, పట్నం శివప్రసాద్, ఐద్వా సావిత్రి, సీఐ కత్తి శ్రీనివాసులు తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. భాష పట్ల మమకారం, కళలు, క్రీడలు, వైజ్ఞానిక విషయాల పట్ల ఆసక్తిని పెంచేలా బాలోత్సవాన్ని నిర్వహించడంపై హర్షం వ్యక్తంచేశారు. అనంతరం వివిధ పాఠశాలల చిన్నారులకు జ్ఞాపికలనందించారు. ఆత్మీయ అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి రాంభూపాల్, సాహితీవేత్తలు తరిమెల అమరనాథరెడ్డి, జట్టి జైరాం, డాక్టర్ పతికి రమేష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఓర్వలేక పచ్చ రాతలు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి వస్తున్న జనాదరణ చూసి పరిటాల కుటుంబం కుట్ర
- ఎల్లో మీడియాలో అసత్య కథనాలు
- దొంగ బియ్యం వ్యాపారం చేసి రూ.కోట్లు సంపాదించిన చరిత్ర పరిటాల రవీంద్రది
- ఆయన ఎమ్మెల్యేగా ఉన్నంత కాలమూ ఎఫ్‌సీఐ టెండర్లలో పోటీ లేకుండా చేసుకున్నారు
- ధైర్యముంటే దీనిపై సీబీఐ లేదా సీఐడీ విచారణ కోరాలి
- సవాల్ విసిరిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి



రాప్తాడు రూరల్: రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక పరిటాల కుటుంబం, ఎల్లో మీడియా జతకట్టి.. జనాల్లో ఎమ్మెల్యే కుటుంబాన్ని పలుచన చేసే కుట్రకు తెర తీశారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి (చందు) మండిపడ్డారు. భూమి విషయంలో తాటిచెర్లలో సూర్యనారాయణరెడ్డిని తాను బెదిరించానంటూ ఓ పత్రికలో కథనం రాస్తే స్వయంగా అతనే వెళ్లి డీఎస్పీని కలిసి ఆ పత్రికపై ఫిర్యాదు చేశాడన్నారు. ఆ కథనాన్ని ప్రజలు నమ్మకపోయే సరికి మరో పత్రికలో ఎమ్మెల్యే సోదరులపై మరో అసత్య కథనం రాశారని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఆదివారం అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. పరిటాల రవీంద్ర 25 ఏళ్ల పాటు దొంగ బియ్యం వ్యాపారం చేసిన సంగతి జిల్లా ప్రజలందరికీ తెలుసన్నారు. పావగడ మీదుగా కర్ణాటకకు తరలించి రూ.కోట్లు అక్రమంగా సంపాదించాడన్నారు. ఈ విషయాన్ని జిల్లా టీడీపీ నాయకులే చెబుతారన్నారు.

**ధైర్యముంటే విచారణ కోరండి**

పరిటాల రవీంద్ర ఎమ్మెల్యేగా ఉన్నంత కాలమూ ఎవరినీ పోటీలో ఉండనీయకుండా ఎఫ్‌సీఐ టెండర్లు దక్కించుకున్నాడన్నారు. దీనిపై ధైర్యముంటే సీబీఐ లేదా సీఐడీ విచారణ కోరాలని పరిటాల కుటుంబానికి సవాల్ విసిరారు. తాము సీఐడీ విచారణకు సిద్ధమని, ఎక్కడైనా దందాలు చేసి ఉంటే నిరూపించాలని అన్నారు. పరిటాల హయాంలో భూదందాలు ఏ స్థాయిలో చేశారో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారన్నారు. కోడిగుడ్ల టెండర్లలో చేసిన దోపిడీ ప్రజలకు తెలుసన్నారు.

**కడుపు మంటతోనే కుట్రలు**

2019 ఎన్నికల నామినేషన్ సందర్భంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. మొన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రాప్తాడులో కార్యక్రమం ఏర్పాటు చేస్తే కనీవినీ ఎరుగని రీతిలో జనాలు వచ్చారన్నారు. తోపుదుర్తిలో జరిగిన ఊరి దేవర కార్యక్రమానికి కూడా జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారన్నారు. దీంతో పరిటాల కుటుంబానికి కడుపు మండిందని, ఎల్లో మీడియాలో తోపుదుర్తి సోదరులపై అన్యాయంగా కథనాలు రాయిస్తున్నారని విమర్శించారు. ప్రకాష్‌రెడ్డి వ్యక్తిత్వం హరించేలా చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పరిటాల కుటుంబానికి ప్రజలే చావుదెబ్బ కొడతారని హెచ్చరించారు.

## మత్స్యకారులకు ఆర్థిక భరోసా

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి


పీఏబీఆర్‌లో చేప పిల్లలు వదులుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కూడేరు: మత్స్యకారులకు ఆర్థిక భరోసా దక్కేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలను అమలు చేస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన 2 లక్షల చేప పిల్లలను కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్‌లో ఆదివారం ఆయన వదిలారు. అంతకు ముందు మత్స్య శాఖ డీడీ శాంతితో కలసి గంగపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక ఆటుపోట్ల మధ్య జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు చేపల వేట విరామ సమయంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని జగన్ సర్కార్ అందజేస్తోందన్నారు. అలాగే చేప పిల్లల కొనుగోలుకు 40 శాతం నిధులను మంజూరు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, కొర్రకోడు సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు శివలాల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు తుప్పటి హరీష్, బైరెడ్డి రామచంద్రారెడ్డి, దేవేంద్ర, గంగాధర్, తేజోనాథ్, వెంకటరామిరెడ్డి, ధనుంజయ, అశోక్, నరేష్, సిద్దారెడ్డి, మంజునాథ రెడ్డి, పెన్నోబులేసు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## రాణించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్రస్థాయి షటిల్ టోర్నీలో జిల్లా క్రీడాకారులు రాణించారు. కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్–14 విభాగంలో బాలికల జట్టు విజేతగా నిలిచింది. జట్టులో యజ్ఞశ్రీ, నక్షత్ర, విష్ణు సహస్ర, దీప్తి, వెన్నెలరెడ్డి ఉన్నారు. అండర్–14, 17 విభాగాల్లో జిల్లా నుంచి నక్షత్ర, మురారి వెంకట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.





## అనంత సత్తా చాటిన లఘుచిత్రోత్సవం

అనంతపురం కల్చరల్: వారం రోజులుగా అనంత వేదికగా సాగిన లఘుచిత్ర వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సినీ దర్శకుడు రషీద్‌బాషా నేతృత్వంలో స్థానిక మాసినేని ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, సామాజిక సేవాకార్యకర్త అనిల్‌కుమార్‌రెడ్డి, బుల్లితెర నటుడు రమేష్ నీల్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఆచార్య సుధాకరబాబు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. జాతీయ వేదికలకే పరిమితమైన లఘుచిత్రోత్సవాన్ని అనంతకు రప్పించిన నిర్వాహకులను ఘనంగా అభినందించారు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభ కలిగిన కళాకారులున్నారని, ఇలాంటి చిత్రోత్సవాలు వారిని ప్రోత్సహించే దిశగా తోడ్పాటునందిస్తాయన్నారు. కార్యక్రమానికి ముందు సినీనటి జమునకు కళాకారులు శ్రద్ధాంజలి ఘటించారు. సుధాకరబాబు, శ్రీదేవి ఆలపించిన అలనాటి యుగళగీతాలు, చిన్నారి లాలిత్య శాస్త్రీయ నృత్యం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చివరిగా విజేతలకు బహుమతులందించారు.అనంతరం ఆత్మీయ అతిథులను సత్కరించారు.

## అ'పూర్వ' కలయిక



నార్పల: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. 1989–90లో పదో తరగతి చదువుకున్న వారు 33 ఏళ్ల తర్వాత ఒక్కసారిగా కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ పాల్గొన్నారు.

## ఈ ఆత్మీయ సమ్మేళనానికి 22 ఏళ్లు



యాడికి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అదే పాఠశాల వేదికగా ఘనంగా జరిగింది. మొత్తం 300 మంది విద్యార్థులకు గాను 250 మంది హాజరయ్యారు. ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వివిధ హోదాల్లో ఏపీతో పాటు తెలంగాణ, విదేశాల్లో స్థిరపడిన వారందరూ తరలి వచ్చారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారందరూ తీయని అనుభూతులకు లోనయ్యారు. నాడు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కరెడ్డి, ఉపాధ్యాయులు పద్మావతి, భాగ్యలక్ష్మి, యంద్రలీల, నారాయణస్వామి, నూర్ మహమ్మద్, జనార్దన శర్మ, శ్రీలక్ష్మి, గురుస్వామి, నరసింహారెడ్డి, సుదర్శనరాజు, విశ్వనాథ్ తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వక్ఫ్‌బోర్డు సభ్యుడు ఆసీఫ్, పూర్వ విద్యార్థులు పరమేశ్వర్, విశ్వం నేతృత్వం వహించారు.

## పదోన్నతి పొందిన స్థానాల్లోనే సర్వీసు పరిగణనలోకి తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్యుడు

అనంతపురం: ఇటీవల పదోన్నతి కల్పించిన కేడర్‌లోనే సర్వీసు పరిగణనలోకి తీసుకోవాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. 3, 4, 5 తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన నేపథ్యంలో నియమితులైన సబ్జెక్టు ఉపాధ్యాయుల సర్వీసు పరిగణలోకి తీసుకోవడంతో పాటు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జి.సూర్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి కోరారు. ఇటీవల నిర్వహించిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా ఒకే సబ్జెక్టుకు ఇద్దరిని నియామకం చేశారని వెంటనే వాటిని సవరించాలన్నారు. ఎస్టీయూ కన్వీనర్లు శివయ్య ఆచారి, సూర్యనారాయణ గౌడ్, బాబ్జీ నాయక్, రామాంజినేయులు, సురేష్, కిషోర్, ఇమాంసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీలో జిల్లా వాసి


మధుసూదన్‌రావు

అనంతపురం అర్బన్: ఏపీ రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన గార మధుసూదనరావు ఎన్నికయ్యారు. కూడేరు మండల డిప్యూటీ తహసీల్దారుగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే హెచ్చెల్సీ ఎస్‌డీసీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నరేష్‌ను ఈసీ సభ్యుడిగా ఎంపిక చేశారు. గుంటూరు పెన్షనర్ల భవనంలో ఆదివారం జరిగిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ ఎంపిక జరిగింది.

## సెమీస్‌లో అనంత హాకీ మహిళల జట్టు


సెమీస్‌కు చేరిన అనంత మహిళల జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా యలమంచిలిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా మహిళల జట్టు సెమీస్‌కు చేరింది. బాపట్లపై 13–0, నెల్లూరుపై 4–1, శ్రీకాకుళంపై 3–0 గోల్స్ తేడాతో విజయం సాధించి సెమీస్‌లో అనకాపల్లి జట్టుతో తలపడనుంది. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులను హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనిల్‌రాజ్‌కుమార్, మారుతి, నాగరాజు అభినందించారు.

## జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. కర్నూలు వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన అండర్–17 బాలికల విభాగంలో పుష్ప, బాలుర విభాగంలో ప్రణవ్‌కుమార్, శేషసాయి, అండర్–14 బాలుర విభాగంలో చరణ్, బాలికల విభాగంలో గీతిక ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చైర్మన్ కృష్ణయ్య, కార్యదర్శి రవికుమార్, కో–ఆర్డినేటర్ నాగరాజు, పీడీలు నాగరాజు, వేణు, కోటప్ప, రమేష్, శివ అభినందించారు.

## లోకేష్ పాదయాత్ర ఓ బూటకం

- బీసీ జాతీయ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్

గుంతకల్లు: నారా లోకేష్ పాదయాత్ర, ఓ బూటకమని బీసీ జాతీయ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అధికారం కోసం దిగజారుడు రాజకీయాలు చేయడం టీడీపీ నేతలకు బాగా తెలుసునన్నారు. ఇందులో భాగంగానే లోకేష్ తన పాదయాత్రలో బీసీలను ఆకట్టుకునేందుకు 34 శాతం రిజర్వేషన్ ప్రకటించారన్నారు. ఉద్యోగాల కల్పన పేరుతో మరోసారి నిరుద్యోగుల ఓట్లకు గాలం వేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం నినాదంతో ప్రజల ముందుకు వచ్చిన చంద్రబాబు... అధికారం వచ్చిన తర్వాత ఏ ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పించలేదనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు. ప్రత్యేక బడ్జెట్ కింద బీసీల అభ్యున్నతికి రూ.10వేల కోట్లు ఇస్తామని కేవలం రూ.993 కోట్లు మాత్రమే విడుదల చేసి దగా చేశారన్నారు. లోకేష్‌కు కానీ, చంద్రబాబుకు కాని బీసీలు, నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం దక్కిందని, 53 బీసీ కులాల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని కొనియాడారు.

# ప్రజారోగ్యమే పరమావధి

- నగర శుభ్రత కోసం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులు
- చలిలోనూ ఆరోగ్యాన్ని లెక్క చేయని యోధులు
- వేకువ జామున 5 గంటల నుంచే విధులకు
- రోజూ కంపోస్టు యార్డుకు 120 టన్నుల చెత్త తరలింపు


వరద సమయంలో వీధులు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్)


మున్సిపల్ కార్మికులకు సూచనలిస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి (ఫైల్)

అనంతపురం క్రైం: ప్రజారోగ్యమే పరమావధిగా భావించే శ్రామికులు వీరు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి.. నగర పరిశుభ్రతకు నిరంతరం పాటుపడుతున్న యోధులు.. ఎముకలు కొరికే చలి అయినా.. జోరుగా కురిసే వర్షంలో అయినా.. వేకువజామునే విధులకు వచ్చి వీధుల్లో చెత్త ఊడ్చడం, కాలువల్లో వ్యర్థాలు తొలగించే పనిలో నిమగ్నమవుతున్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. వారందిస్తున్న సేవలకు ప్రతి ఒక్కరూ సలాం కొట్టాల్సిందే.

నగరంలోని 50 డివిజన్లలోని ఆరు సర్కిళ్ల పరిధిలో పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. అప్కాస్ కింద 404 , రెగ్యులర్ 131 , కోవిడ్ సమయంలో తీసుకున్న 70 మంది కార్మికులు, మలేరియా 33 మంది సిబ్బంది (ఫాగింగ్, స్ప్రేయింగ్) రోజూ ఉదయం 4 గంటల నుంచి 4.30 గంటలకే నిద్రలేవడం..5 గంటలకు వివిధ సర్కిళ్లలో హాజరు వేసుకొని విధులకు వెళ్తారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన చెత్తను కాంపాక్టర్లు, ట్రాక్టర్లు, ఆటోలు, తదితర మొత్తం 53 వాహనాల ద్వారా కంపోస్టు యార్డుకు తరలించేలా నగరపాలక సంస్థ కమిషనర్ కే భాగ్యలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో రోజూ 120 టన్నుల చెత్తను కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు.

**రెండు షిఫ్టుల్లో విధులు :**
నగరాన్ని శుభ్రం ఉంచడంతో పాటు వ్యాధులుదరి చేరకుండా ఉండేందుకు కార్మికులు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 2 నుంచి 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో పడేయడం ద్వారా కార్మికులపై అదనపు భారం పడుతోంది. చెత్తను ఓ డబ్బాలో ఉంచుకొని పుష్కాట్లు, క్లాప్ ఆటోలకు అందిస్తే ఎలాంటి సమస్య ఉండదని కార్మికులు, అధికారులు చెప్తున్నారు. పూడికతీత పనుల కోసం నగరపాలక సంస్థ రూ.లక్షలు వెచ్చించింది. ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆటోల్లో తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ ప్రజలు నిర్దేశించిన వాటిలో చెత్తను ఇవ్వకుండా కలిపి ఇవ్వడంతో చెత్తను వేరు చేయడానికి సమస్య ఏర్పడుతోంది.

### చెత్తను మా చేతికివ్వండి



నగరపాలక సంస్థలో 29 ఏళ్లుగా పని చేస్తున్నా. రోడ్లు శుభ్రం చేసేందుకు రోజూ 4.30 గంటలకే విధుల్లోకి వస్తాం. రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి రెవెన్యూ కాలనీ వరకు శుభ్రం చేస్తున్నా. ప్రజలు చెత్తను మా చేతికివ్వాలి. ఎక్కడపడితే అక్కడ పడేయకూడదు.

– నాగలక్ష్మి, నాల్గో సర్కిల్పారిశుధ్య కార్మికురాలు

### కార్మికుల సేవలు వెలకట్టలేనివి



నగర పరిశుభ్రతకు కార్మికులు చేస్తున్న సేవ వెలకట్టలేనిది. 'అనంత'ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ఎంతగానో కృషి చేస్తున్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకురావాలి. వారికి పాలకవర్గం ఎప్పుడూ అండగా ఉంటుంది. పరిశుభ్రతలో కార్మికులకు ప్రజలు సహకరించాలి. డస్ట్బిన్లలోనే చెత్తను వేసి ఇవ్వాలి.

– మహమ్మద్ వసీం, మేయర్

# సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నాం

- 'గడప గడపకూ'లో మహిళల ఆనందం

అనంతపురం రూరల్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పిల్లలను చదివించుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుని సంతోషంగా ఉన్నామని మహిళలు సంతోషంగా వ్యక్తం చేశారు. ఆదివారం రుద్రంపేట పంచాయతీలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, సర్పంచ్ పద్మావతి, ఎంపీపీ వరలక్ష్మి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీటీసీ మహబూబీ కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.

**పార్టీలకతీతంగా అందిస్తున్నాం**
ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రుద్రంపేట పంచాయతీ అభివృద్ధిని టీడీపీ నాయకులు పూర్తిగా విస్మరించారన్నారు. రుద్రంపేట పంచాయతీని నగరానికి ధీటుగా అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాతనే పంచాయతీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సాధిక్‌వలి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, గోవింద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుళ్లాయప్ప, కృష్ణవేణి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, మల్లెల వేణుగోపాల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు**


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామల

– అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడి తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక రాంనగర్‌లోని శ్రీనగర్ కాలనీలోని 36వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక డివిజన్ కార్పొరేటర్ మణికంఠ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం మూడున్నరేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందించారు. ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నామన్నారు.

**మహిళలకు సున్నా వడ్డీ :** మహిళా సంఘాలు బలోపేతం కోసం సున్నా వడ్డీని ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పావలా వడ్డీ వర్తించిందన్నారు. కొత్త సంఘాలను ఏర్పాటు చేయడం, కొత్త వారిని సంఘాల్లో చేర్చుకోవడం సంఘాలకు అధికంగా లబ్ధి చేకూరే విధంగా రీసోర్స్ పర్సన్లు చొరవ తీసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో సమస్యలు వింటూ వాటికి పరిష్కారం చూపుతామని వారికి హామీ ఇస్తూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముందుకు సాగారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అనంత చంద్రారెడ్డి, సాగర్, నగర అధ్యక్షుడు చింత సోమశేఖరరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జ్ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీదేవి, శ్రీనివాసులు, దాసరి గోవిందు, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, సంపంగి రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, నరసింహులు, భారతి, శోభాబాయి, షేక్ జావిద్, ఉష, నారాయణమ్మ, జయమ్మ, నిహార్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉరుసు**
అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని సాయినగర్‌లో ఉన్న రెహమానియా మసీదులో ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఆదివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్ సైఫుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే అనంతకు కృతజ్ఞతలు**
అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవీకాలాన్ని పొడిగించినందుకు ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామల గౌడ్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పదవీకాలాన్ని కొనసాగించిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే అనంతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పంపనూరులో అరుణ హోమం


ప్రత్యేక బంగారు కవచ అలంకరణలో సర్పరూపుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాఘమాసం రెండో ఆదివారం అరుణ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాలాభిషేకం, బంగారు కవచ సేవ, అలంకరణ, ఆకుపూజ, కుజదోష , రాహుకేతు దోష, సర్పదోష కాల సర్పదోష, రాహుకేతు దోష, సుబ్రహ్మణ్యేశ్వర బీజాక్షరం వంటివి నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతిదేవికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఎర్రిస్వామి, అర్చకులు పాల్గొన్నారు.


అరుణ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

## ఏపీ రైతు సంఘం నూతన కమిటీ ఎంపిక

కనగానపల్లి: ఏపీ రైతు సంఘం మండల నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు బెల్లం మహదేవ తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలో ఆదివారం మండల రైతు సంఘం నాయకులు సమావేశమయ్యారు. సమావేశానికి రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, జిల్లా నాయకులు హాజరై మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కమిటీ గౌరవాధ్యక్షుడిగా గోవిందు, అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, పి. రవి, ఉపాధ్యక్షుడిగా అంకే నాగేష్, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతాంగ సమస్యలపై నిత్యం పోరాడుతూ రైతుల పక్షాన పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు బాలరాజు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన నూతన కమిటీ సభ్యులతో ఏపీ రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

## సునామ జకినీమాత జాతరకు ఏర్పాట్లు

గుత్తి: స్థానిక ఆర్ఎస్ రోడ్డులో ఉన్న సునామ జకినీ మాత ఆలయంలో ఫిబ్రవరి 2 నుంచి తలపెట్టిన జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆరె కటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణరావు అన్నారు. సునామ జకినీ మాత ఆలయంలో ఆదివారం ఆయన ఆరె కటిక సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే ఏకైక ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత ఆలయం గుత్తిలో మాత్రమే ఉందన్నారు. 20 ఏళ్ల క్రితం ఆలయం నిర్మించామని, అప్పటి నుంచి మాఘ మాసంలో అమ్మవారి జాతర జరుపుతున్నామన్నారు. జాతరకు ఏపీ, తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి ఆరె కటికలు పెద్ద ఎత్తున తరలివస్తారన్నారు.

## 21న మద్దానేశ్వర స్వామి రథోత్సవం

రాయదుర్గం రూరల్: మండలంలోని మద్దానేశ్వర స్వామి రథోత్సవం ఫిబ్రవరి 21న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు తెలిపారు. రథోత్సవ ఏర్పాట్ల గురించి ఆదివారం స్థానిక ఆలయంలో ఆదివారం చర్చించారు. ఆయన మాట్లాడుతూ పశువుల జాతర సందర్భంగా ఫిబ్రవరి 9న బండిమోటు వేలం నిర్వహిస్తామన్నారు. అలాగే మార్చి 1న ముత్యాల పల్లకోత్సవంతో జాతర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి, గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో భక్తుల సందడి


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


కనగానపల్లిలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఏకవార రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచే గాక జిల్లా నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ప్రాంగణంలోని 108 శివలింగాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

### సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మారుపూజ

కనగానపల్లి: మండలంలోని దాదులూరు కొట్టాలలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం మారుపూజ నిరవహించారు. గ్రామంలో గతేడాది సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. స్థానిక గ్రామ పెద్దల ఆధ్వర్యంలో తిరిగి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలకంరించి, భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్థానిక గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

## సంత ద్వారా రూ.1.92 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.1,92,120 ఆదాయం సమకూరినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. పశువులకు వ్యాపిస్తున్న ముద్దచర్మవ్యాధి (లంపీస్కిన్ డిసీసెస్) కారణంగా గతేడాది సెప్టెంబర్ మూడో వారం నుంచి మార్కెట్‌యార్డులో పశువుల సంత బంద్ చేశామన్నారు. కేవలం శనివారం మాత్రమే గొర్రెలు, మేకల క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు.

## అనంతలో విజయవంతంగా 2 కే రన్


2 కే రన్‌ను ప్రారంభిస్తున్న అనంత చంద్రారెడ్డి, జాకీర్ హుస్సేన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని రాంనగర్ నీరు – ప్రగతి పార్కు వద్ద డీఎస్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో 2కే రన్‌ను విజయవంతంగా ప్రారంభమై రాంనగర్ బ్రిడ్జి వరకు కొనసాగింది. రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అనంత చంద్రారెడ్డి, 4వ పట్టణ సీఐ జాకీర్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అనంతలో క్రీడాకారులకు కొదువ లేదన్నారు. క్రీడాకారులు పెద్ద ఎత్తున రాణిస్తున్నారన్నారు. 2 కే, 3 కే, 5కే, 10 కే రన్ కొనసాగించాలన్నారు. క్రీడాకారులు క్రీడలపై పెద్ద ఎత్తున ఆసక్తి చూపేందుకు దోహదం చేస్తాయన్నారు. అకాడమీ కోచ్ శ్రీకాంత్ రెడ్డిని వారు అభినందించారు.

## ఉచిత వైద్యశిబిరం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగర శివారులోని రాజీవ్ కాలనీ పంచాయతీ కార్యాలయంలో గఫూర్ హాస్పిటల్స్, సీఆర్‌డీ మహాత్మగాంధీ రెయిన్‌బో లర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ ఆశాబీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు అర్షద్ అయూబ్, సద్దాం బాషా, మల్లి యాదవ్, ఆయేష, శ్రీలత, మేఘన, కీర్తి, రూపశ్రీ, సుదర్శన్‌రెడ్డి, మొహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

## ఘనంగా ఆరాధనోత్సవం

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో గుత్తి డివిజనల్ చైర్మన్ పాస్టర్ డేవిడ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తర భారతదేశ ఆర్మీ మేజర్, చండీఘడ్ దైవ సేవకుడు దామోదర్ ప్రసంగించారు. రోజూ దేవుని వాక్యాన్ని పఠించడం వల్ల నిజమైన భయభక్తులు చేకూరుతాయన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ సామగ్రి దగ్ధం

గుంతకల్లు రూరల్: పాతకొత్తచెరువులో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ సామగ్రి కాలిపోయింది. బాధితుడి వివరాలు.. శ్రీనివాసులు గ్రామ బస్టాండ్ వద్ద హోటల్ నిర్వహిస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం రాత్రి హోటల్ పనులు ముగించుకొని తాళం వేసుకొని ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగి హోటల్‌లో ఉన్న ఫ్రిడ్జి, హోటల్ నిర్వహణకు అవసరమైన తిండి సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి కాలిపోయినట్లు గుర్తించాడు. ఘటనలో దాదాపు రూ.60 వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

## క్లుప్తంగా

### నేడు 'స్పందన'

కనగానపల్లి: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ పీవీ రమణ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో అధికారులు పాల్గొని, ఫిర్యాదులు స్వీకరించాలన్నారు.

### నానీల నాగేంద్రకు రాష్ట్రస్థాయి పురస్కారం


నానీల నాగేంద్ర

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన యువకవి నానీల నాగేంద్రకు రాష్ట్రస్థాయి కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం లభించింది. చిన్నవయసు నుంచే భావాత్మకంగా సమకాలీన సమస్యలపై కవిత్వం చెపుతున్న నాగేంద్రను ఈ ఏడాది పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య సుమకిరణ్ తెలిపారు. ఆయన వచ్చే నెల 26న హైదరాబాద్‌లో నగదు పురస్కారంతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటారన్నారు. నాగేంద్రను కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అభినందించారు.

### 31న ఏబీవీపీ జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్‌కుమార్ రెడ్డి

అనంతపురం: అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 31న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఏబీవీపీ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్ కుమార్ రెడ్డి అన్నారు. అనంతపురం నగరంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నగరంలోని సాయినగర్‌లోని యాపిల్ ఫంక్షన్ హాలులో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి శివతేజ, ఉపాధ్యక్షుడు కమలాకర్, సుధీర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

### అశ్వత్థం తిరునాలకు 15 ఆర్టీసీ సర్వీసులు


తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన బస్సు

తాడిపత్రి టౌన్: పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి తిరునాలకు రెండో ఆదివారం 15 ప్రత్యేక సర్వీసులను నడిపినట్లు ఆర్టీసీ డీఎం శంకర్ తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆశ్వత్థం తిరునాలకు సంబంధించి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


జ్యోతి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

రామగిరి: మండలంలోని రెడ్డివారిపల్లిలో ఆదివారం అనారోగ్యంతో హరిజన జ్యోతి(22) మృతి చెందింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన మేరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్త నారాయణ చిన్న కుమార్తె జ్యోతి బెంగళూరులోని ఎస్‌బీఐలో అకౌంటెంట్‌గా పని చేస్తుండేది. ఇటీవల గుండెనొప్పి రావడంతో స్థానికంగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనల మేరకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, మండల అగ్రిబోర్డు చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు సిద్దన్న, రాజేష్, రామ్మూర్తి, నాయకులు వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మారుతీరెడ్డి, అంజి, పెద్దన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ స్వామి.. నమోస్తుతే!

పెద్దపప్పూరు: మాఘమాసం అశ్వత్థం తిరునాల్లో భాగంగా రెండో ఆదివారం క్షేత్రం నారాయణ స్వామి నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి అర్చకులు శింగరబట్టు, గణపతి, నారాయణ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి నారాయణ స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు పెన్నా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి తడి దుస్తులతో ఓం నమో నారాయణాయ అంటూ స్వామి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు ముడుపులు, కానుకలతో పాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం భక్తులకు సౌకర్యాలు కల్పించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోమస్తు ఏర్పాటు చేశారు.